మైదానాల్లేవ్.. ఆటల్లేవ్..!

- క్రీడలకు దూరమవుతున్న విద్యార్థులు
- ఆరోగ్యం, శరీర సౌష్టవంపై ప్రభావం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాల

మదనపల్లె సిటీ: పిల్లలు చదవాలి.. ఆడాలి.. అప్పుడే వారు ఆరోగ్యపరంగా ఫిట్‌గా ఉంటారు. అయితే ఆటలకు దోహదపడే క్రీడా మైదానాలు మదనపల్లె పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఎక్కడా కానరావడం లేదు. ఆటలాడే ఆసక్తి గతల పిల్లలు బడి బయట ఎక్కడో తోచిన చోట ఆడుకుంటున్నారు. ఏ పాఠశాలలో ఏ కార్యక్రమం జరిగినా విద్యార్థులను ఉద్దేశించి ముఖ్య అతిథులు చెప్పే తొలి మాట క్రీడలతో మానసిక ఉల్లాసం, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని చెబుతారు. మదనపల్లె పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, బీటీ కాలేజీ తప్పా ఏ ఒక్క మున్సిపల్ పాఠశాలలో, ప్రైవేటు పాఠశాలల్లో క్రీడా మైదానాలు మచ్చుకు కనిపించవు. పట్టణంలో సుమారు మూడు లక్ష వరకు జనాభా ఉన్నారు.

క్రీడలకు పుట్టినిల్లు

పట్టణంలో సుమారు వందకు పైగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. మదనపల్లె డివిజన్ కేంద్రం కావడంతో పాటు ఇక్కడ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించారు. క్రీడలకు మదనపల్లె పుట్టినిల్లు. ఇలాంటి చోట కనీసం స్టేడియం లేకపోవడంతో క్రీడాకారులు నిరుత్సాహ పడుతున్నారు. ఇటీవల ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు హాకీ, ఫుట్‌బాల్, షూటింగ్‌బాల్, క్రికెట్, వాలీబాల్ పోటీల్లో రాణిస్తున్నారు. వీరిని మరింత ప్రోత్సహిస్తే క్రీడల్లో రాణించే అవకాశాలు ఉన్నాయని క్రీడాకారులు తల్లిదండ్రులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

క్రీడల అభివృద్ధికి కృషి



మదనపల్లెలో స్టేడియంకు స్థలం కేటాయిస్తే స్టేడియం నిర్మాణం చేపడుతాం. క్రీడలకు మదనపల్లె ఎంతో పేరు ప్రఖ్యాతులున్నాయి. జిల్లాలో మైదానాలు, క్రీడాభివృద్ధికి రూ.50 కోట్లు కేటాయించారు. క్రీడల అభివృద్ధికి కృషి చేస్తాం.
–గౌస్‌బాషా, డీఎస్‌డీఓ

గోదాదేవి అవతారంలో శ్రీ లక్ష్మీజనార్దనస్వామి


ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

రామసముద్రం : మండల కేంద్రంలో వెలసిన శ్రీ లక్ష్మీ జనార్దనస్వామి రథోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారు గోదాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించారు. ఆలయ అర్చకులు పార్థసారధి భట్టర్, కులశేఖర్‌భట్టర్‌లు భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం స్వామివారికి తోమాలసేవ చేసి విశేష అలంకరణ చేశారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.

సీమ సాహిత్యం స్ఫూర్తిదాయకం


మాట్లాడుతున్న మురళీధర్‌రాజు

పీలేరు: రాయలసీమ నుంచి గొప్ప ఆధునిక సాహిత్యం వస్తోందని, ఇక్కడి సాహిత్యం ఎంతో స్ఫూర్తిదాయకమని కవి జలకనూరి మురళీధర్ రాజు అన్నారు. కడప నగరంలోని శంకరాపురం ఐఎంఏ హాలులో రెండు రోజుల పాటు జరిగిన కవి సమ్మేళనంలో పీలేరుకు చెందిన మురళీధర్ రాజు పాల్గొని పద్యగానం చేశారు. వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం పిలుపు మేరకు ×వెయ్యేళ్ల తెలుగు సాహిత్యం – రాయలసీమ భాగస్వామ్యం, సాహిత్య, సంస్కృతిలో రాయలసీమ వైభవం¤ గూర్చి కవి సమ్మేళనం నిర్వహించారు. ఇందులో మురళీధర్‌రాజు రాయలసీమ కవులు, శ్రీకృష్ణదేవ రాయులు, అల్లసాని పెద్దన, నాచన సోమన, అన్నమయ్య, వేమన, వీరబ్రహ్మంపై ఆటవెలది, కందము, సీస పద్యాలు రచించి గానం చేశారు. ఆయన్ను నిర్వాహకులు జింకా సుబ్రమణ్యం, మూల మల్లికార్జునరెడ్డి, ఆచార్య వెలుగొంద నిత్యానందరావు, హనుమంతరావు దుశ్శాలువతో సత్కరించారు.

నేడు సామాజిక తనిఖీ బహిరంగ సభ

కేవీపల్లె : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీపథకంపై సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుధాకర్ తెలిపారు. మండలంలో 2023 ఏప్రిల్ ఒకటి నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ చర్చ ఉంటుందని చెప్పారు. సోమవారం ఉదయం 10 గంటలకు జరిగే సామాజిక తనిఖీ బహిరంగ సభకు స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు, ఉపాధి కూలీలు, ఉపాధి, పంచాయతీ సిబ్బంది, డ్వాక్రా సంఘాల మహిళలు హాజరు కావాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో ఫాతెహా


ప్రత్యేక అలంకరణలో దర్గా

మదనపల్లె సిటీ: మదనపల్లె మండలం సీటీఎం రైల్వేగేట్ వద్దనున్న హజరత్ సయ్యద్ నాదర్ షాహ్ వల్లి దర్గా ఉరుసు ఉత్సవాల్లో భాగంగా ఆదివారం భక్తి శ్రద్ధలతో ఫాతెహా నిర్వహించారు. ఉరుసు పురస్కరించుకుని దర్గాను విద్యుత్‌దీపాలతో అలంకరించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఫకీర్లు భక్తిగీతాలు ఆలపించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో మకాన్‌దార్ జాఫర్‌వలీ, నిర్వాహకులు పాల్గొన్నారు.

వెంకన్నకు లక్ష్మి కాసులహారం వితరణ


లక్ష్మికాసుల హారాన్ని అందజేస్తున్న దాతలు

తంబళ్లపల్లె: మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వేంకటరమణస్వామికి కోసువారిపల్లె పంచాయతీ ఎగువముత్రవారి పల్లెకు చెందిన బి.మల్లికార్జునరెడ్డి, గీత దంపతులు రూ. 3 లక్షలు విలువ చేసే వెండి లక్ష్మికాసులు హారం అందజేశారు. ఆదివారం ఆలయంలో జరుగుతున్న స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆ హారాన్ని ఊరేగింపుగా తీసుకువచ్చారు. హారాన్ని డిప్యూటీ ఈఓకు అందజేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి


మిథున్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కరీముల్లా

మదనపల్లె : టెలికమ్యూనికేషన్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా ఎస్.ఏ.కరీముల్లా తెలిపారు. చిత్తూరు టెలికాం డిస్ట్రిక్ట్ టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ మెంబర్ (టీఏసీ)గా పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, అన్నమయ్యజిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ ఎస్.ఏ.కరీముల్లా నియమితులయ్యారు. దీనికి సంబంధించి తిరుపతి టెలికాం డిస్ట్రిక్ట్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ నియామక ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్.ఏ.కరీముల్లా మాట్లాడుతూ రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సిఫారసుతో తనకు చిత్తూరు టెలికాం డిస్ట్రిక్ట్ టీఏసీ మెంబర్‌గా అవకాశం వచ్చిందని పేర్కొన్నారు.

రెడ్డెమ్మకొండలో భక్తుల రద్దీ


సంతానం కోసం అమ్మవారి ఎదుట వరపడిన మహిళలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. రెడ్డెమ్మతల్లీ చల్లంగా చూడు తల్లీ అంటూ భక్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో మొక్కుకొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి వేకువజామునే నైవేద్యాలు సమర్పించి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సంతన ప్రదాయినిగా ప్రసిద్ధి పొందిన అమ్మవారి ఆలయానికి ఉదయం నుంచే భక్తుల రాక మొదలైంది. ఆలయ పరిసరాల్లోని దిగువ తొట్లివారిపల్లెలో అమ్మవారి అర్చకుల కుటుంబీకులు పంపిణీ చేసే ఆకు పసరును సేవించి మహిళలు అమ్మవారి కోనేట్లో పవిత్ర స్నానమాచరించారు. తడిబట్టలతోనే అమ్మవారి ఎదుట సంతాన కోసం వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరసారెలతో మొక్కుబడులు చెల్లించుకొన్నారు. పలువురు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకొన్నారు.

అరటితోట దగ్ధం

పుల్లంపేట: మండలంలోని టి.కమ్మపల్లి సమీపంలో రైతు పసుపులేటి రవికుమార్‌కు చెందిన ఏడెకరాల అరటి తోట ఆదివారం విద్యుదాఘాతంతో దగ్ధమైంది. దాదాపు రూ.20 లక్షల మేర పంట నష్టం వాటిల్లినట్లు రైతు తెలిపారు. ఆదివారం సాయంత్రం రైల్వేకోడూరు శాసన సభ్యులు అరవ శ్రీధర్ పంటను పరిశీలించి ప్రభుత్వం ఆదుకునేలా కృషి చేస్తామని తెలిపారు.

ఆయాలకు కనీస వేతనాలు ఇవ్వాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

పీలేరురూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఆయాలకు కనీస వేతనాలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ కోరారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి కొండారెడ్డి క్రాస్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంవత్సరాల తరబడి ఆయాలతో వెట్టిచాకిరి చేపించుకుంటూ జీతాలు ఇవ్వడం లేదన్నారు. ఆరు వేల రూపాయల గౌరవ వేతనంతో కుటుంబ పోషణ ఎలా సరిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయాలకు ఉద్యోగ భద్రత కల్పించకుండా ప్రభుత్వం ముప్పతిప్పలు పెడుతోందని ఆరోపించారు. ఆయాలపై విద్యాకమిటీలు, స్థానిక రాజకీయ నాయకుల వేధింపులు ఆపాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎల్. నరసింహులు, నాయకులు సురేష్‌కుమార్, వేణుగోపాల్ రెడ్డి, నరసింహులు, టి .ఎల్. వెంకటేష్, శ్రీనివాసులు, మహబూబ్‌అలీ, ఆయాలు యశోద, వెంకటరత్నమ్మ, విమల, నూర్జహాన్, సుమతి, నేత్రావతి, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

'ఆయుష్మాన్'ను సద్వినియోగం చేసుకోవాలి

మదనపల్లె సిటీ: ఆయుష్మాన్ యోజన పథకం సీనియర్ సిటిజెన్స్ సద్వినియోగం చేసుకోవాలని ఏపీ సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మునిగోపాలకృష్ణ కోరారు. ఆదివారం స్థానిక జీఆర్‌టీ ఉన్నత పాఠశాలలో సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో మధ్యతరగతి సీనియర్ సిటిజెన్స్‌కు ఆదాయ పరిమితి రూ.12 లక్షలకు పెంచడంతో విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులకు వరంలాంటిదన్నారు. సీనియర్ సిటిజెన్స్ సమస్యలు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యక్షులు జగన్‌మోహన్, కార్యదర్శి నాగరాజు, కోశాధికారి ఉస్మాన్, గొల్లపూడి తిరుపతిరావు, శ్రీనివాసులు, ధనలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులు ఆరోగ్యంపై దృష్టి సారించాలి

కేవీపల్లె : విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యంపై దృష్టి సారించాలని మండలంలోని గ్యారంపల్లె ఏపీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బ్రహ్మాజీ అన్నారు. ఆదివారం గ్యారంపల్లె ఏపీ గురుకుల పాఠశాలలో పూర్వ విద్యార్థుల సౌజన్యంతో, అంకుర్ హాస్పిటల్స్, సంకల్ప, స్విమ్స్ ఆస్పత్రుల సహకారంతో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరైన వారికి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ సురేంద్రబాబు మాట్లాడుతూ విద్యార్థులు చర్మవ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వెంకటనారాయణ, రాజశేఖర్, ఎం. వినోద్‌కుమార్, ఆర శ్రీనివాసులు, శివ, డాక్టర్ మధు, డాక్టర్ శ్వేత పాల్గొన్నారు.

వైద్యశిబిరం విజయవంతం


కంటి ఆపరేషన్ చేసుకున్న వారికి సూచనలిస్తున్న శ్రీనివాసులురెడ్డి

కేవీపల్లె : మండలంలోని మిన్నంరెడ్డిగారిపల్లెలో పది రోజుల పాటు నిర్వహించిన మెగా కంటి వైద్య శిబిరం విజయవంతంగా ముగిసినట్లు చేసినట్లు నిర్వాహకులు వంగిమళ్ల శ్రీనివాసులురెడ్డి, వంగిమళ్ల నరసారెడ్డి తెలిపారు. ఆదివారం కంటి పరీక్షలు, కంటి ఆపరేషన్లు చేపించుకున్న వారికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పది రోజుల పాటు నిర్వహించిన వైద్యశిబిరంలో సుమారు 600 మందికి కంటి పొర పరీక్షలు చేయడం జరిగిందని, 126 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేయగా, అందులో 105 మందికి అక్కడే ప్రత్యేక బస్సుల్లో విజయవంతంగా ఆపరేషన్లు చేసినట్లు తెలిపారు. కంటివైద్యశిబిరం విజయవంతంగా కావడానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. పొత్తపు సతీష్‌రెడ్డి, శంకర్‌నేత్రాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

బి.కొత్తకోట: గుండె, క్యాన్సర్ సంబంధిత వ్యాధులను గుర్తించేందుకు ఆదివారం యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ ఆదివారం బి.కొత్తకోటలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఇందులో ఆరుగురికి క్యాన్సర్ లక్షణాలను గుర్తించారు. గుండె పరీక్షలు నిర్వహించారు. వీరికి ఉచితంగా వైద్యసేవలు అందిస్తామని స్థానిక సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు.

మహనీయుల ఆశయాలను కొనసాగిస్తాం


రెడ్డిప్రసాద్


ఇర్ఫాన్ ఖాన్

మదనపల్లె : బసవ, పూలే, పెరియార్, అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిస్తామని వీసీకే మదనపల్లె పట్టణ అధ్యక్షుడు వీసీకే పార్టీ అధ్యక్షుడిగా బురుజు రెడ్డిప్రసాద్, బాస్ అధ్యక్షుడు పఠాన్ ఇర్ఫాన్‌ఖాన్ తెలిపారు. విడుదలై చిరుతైగల్ కట్చి(వీసీకే), భారతీయ అంబేడ్కర్ సేన(బాస్) మదనపల్లె పట్టణ అధ్యక్షుల ఎన్నిక ఆదివారం జరిగింది. స్థానిక సీపీఐ కార్యాలయంలో వీసీకే, బాస్ మదనపల్లె పట్టణ సంయుక్త సమావేశం జరిగింది. బాస్ జిల్లా కార్యదర్శి పెద్దపాలెం రవిశంకర్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి వీసీకే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బాస్, వీసీకే పార్టీల లక్ష్యాలను సభ్యులకు వివరించారు. బాస్, వీసీకేలను బలోపేతం చేయడం ద్వారా బసవ, పూలే, పెరియార్, అంబేడ్కర్ ఆశయాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లవచ్చునని పేర్కొన్నారు. అనంతరం జరిగిన బాస్, వీసీకే పట్టణ అధ్యక్ష ఎన్నికలో వీసీకే పార్టీ అధ్యక్షుడిగా బురుజు రెడ్డిప్రసాద్, బాస్ అధ్యక్షుడిగా పఠాన్ ఇర్ఫాన్‌ఖాన్‌లు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన బాస్, వీసీకే పట్టణ అధ్యక్షులకు నాయకులు, సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బాస్ నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ములకలచెరువు: మండలంలోని బురకాయలకోట జెడ్పీ హైస్కూల్‌లో 1992 – 93 సంవత్సరంలో పదోతరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం సందడి చేశారు. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత చదివిన పాఠశాలలోనే కలుసుకుని చిన్ననాటి బాల్యస్మృతులు గుర్తు చేసుకున్నారు. ఆత్మీయ ఆలింగనాలు..పలకరింపులతో ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, శంకర, కనకసభాపతిని ఆహ్వానించి సన్మానించారు. పూర్వ విద్యార్థులు బొగ్గు రెడ్డెప్ప, నారాయణ, గౌస్‌బాషా, చాంద్‌బాషా, మహబూబ్‌బాషా, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.


బురకాయలకోట జెడ్పీ హైస్కూల్ 1992-93 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

మాజీ ఎమ్మెల్యే పరామర్శ


వైఎస్సార్‌సీపీ నాయకుడు రెడ్డి సుబ్రహ్మణ్యంను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల

కలికిరి (వాల్మీకిపురం): పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆదివారం పలుకార్యక్రమాల్లో పాల్గొని పరామర్శించారు. వాల్మీకిపురం పంచాయతీ ఓబులంపల్లికి చెందిన నారెం లక్ష్మీదేవమ్మ, ఇదే గ్రామంలోని హెడ్ కానిస్టేబుల్ పూజారి శశికుమార్ షిర్డిల దశ దినకర్మ కార్యక్రమాలకు హాజరై వారి చిత్రపటాలకు పూలు వేసి వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. చింతపర్తికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు శోభనాల రెడ్డిసుబ్రహ్మణ్యం మోకాలు శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ సందర్భంగా ఆయనను పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అలాగే నాయనివారిపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు సురేంద్ర రెడ్డి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతల శివానంద రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ నీళ్ల భాస్కర్, మైనార్టీ నాయకుడు అబ్దుల్ కలీం, ఆనందరెడ్డి, వాల్మీకిపురం ఉప సర్పంచ్ బిడ్డల కేశవరెడ్డి, న్యాయవాది అశోక్‌రెడ్డి, సుధ పాల్గొన్నారు.

సామాజిక సేవలు విస్తృతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న పీవీ నాయుడు

కలకడ : సామాజిక సేవలు విస్తృతం చేయాలని మానవత స్వచ్ఛందసేవా సంస్థ కలకడ మండల శాఖ అధ్యక్షుడు పీవీ నాయుడు సూచించారు. ఆదివారం కలకడ బాటవారిపల్లెలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు సహాయం, మానవత సంస్థ కార్యాలయం అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సభ్యులను కోరారు. కలకడ, కేవీపల్లె, సంబేపల్లె, గుర్రంకొండ, కలికిరి మండలాల్లో సంస్థ సేవలు అందించడం అభినందనీయమని కొనియాడారు. పేద విద్యార్థులకు చేయూతనివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ జిల్లా కమిటీ సభ్యుడు గంగాద్రినాయుడు, శ్రీనివాసులురెడ్డి, వైవీ రమణ, పీవీ రమణ, ఖాజాఫీర్ పాల్గొన్నారు.

మనసుదోచే.. మామిడి పూత


విరబూసిన మామిడి పూత

'మామిళ్లు పూసినాయి.. మారాకు తొడిగినాయి.. సిలకలు చేరినాయి' అని అద్భుతమైన గేయం రాశాడు ప్రజాకవి గోరేటి వెంకన్న. ఈ గేయానికి దృశ్య రూపమైనట్లు పీలేరు మండలంలో 4,500 ఎకరాల్లో మామిడి తోటల్లోని చెట్లకు పూతలు పూశాయి. గడిచిన మూడేళ్లలో ఎన్నడూ లేని విధంగా తోటల్లో పూత విరగబూసింది. గత ఏడాది 25 శాతం మాత్రే పంట వచ్చింది. అయితే ఈ ఏడాది అందుకు భిన్నంగా ఇప్పటికే 60 శాతం పైగా మామిడి పూత విరబూసినట్లు ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు. సాధారణంగా పూత అధికంగా కనిపించినప్పటికీ పిందె పట్టే సమయంలోతెగుళ్ల బెడద ఉంటుంది. పూత పిందె నేల రాలే అవకాశం ఉంది. రైతులు అప్రమత్తమై పూత దశ నుంచే సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉంది.
–పీలేరు రూరల్

కమనీయం.. కల్యాణం


సర్వభూపాల వాహనంపై స్వామి, అమ్మవార్లు

తంబళ్లపల్లె : మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయంలో ఆరు రోజులుగా టీటీడీ ఆధ్వర్యంలో స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగవైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం స్వామి కల్యాణం కనుల పండువగా జరిగింది. టీటీడీ ఆగమ సలహాదారులు శ్రీనివాసచార్యులు, అర్చకులు కృష్ణప్రసాద్‌భట్టార్, రమేష్‌బాబు, ధనుష్, క్రిష్ణమూర్తి స్వామికి పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు స్వామి దర్శనం కల్పించారు. ఉదయం స్వామిని సర్వభూపాల అలంకరణలో ఊరేగించారు. కార్యక్రమాల్లో టీటీడీ డిప్యూటీ ఈఓ గోపినాథ్, ఇన్‌స్పెక్టర్ దుష్యంత్‌కుమార్, సిబ్బంది నగేష్, నాగరాజు, భక్తులు పాల్గొన్నారు.

స్థలం ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు

కలికిరి: మండలంలోని మద్రికుంటపల్లి గ్రామంలో టీడీపీ కార్యకర్త సమాధుల స్థలం ఆక్రమించుకుని, పూర్వీకుల సమాధులను ఆనవాళ్లు లేకుండా చేశారని మహిళలు జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. మద్రికుంటపల్లి పంచాయతీ వీర్లవాండ్లపల్లికి చెందిన వి.సిద్దయ్య, గౌరమ్మ దంపతుల కుమార్తెలు హేమావతమ్మ, శంకరమ్మ, మహేశ్వరమ్మ, భద్రమ్మ తమ పొలాల సమీపంలో పూర్వకాలం నుంచి తమ తల్లిదండ్రులతో పాటు పెద్దల సమాధులు ఉన్నాయని, అయితే ఇటీవల ఇదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త వి.శంకరయ్య, కొందరితో కలిసి సమాధులను పూర్తిగా ధ్వంసం చేసి స్థలాన్ని ఆక్రమించుకున్నాడని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. స్థలాన్ని పరిశీలించి ఆక్రమణదారులపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకునేలా ఆదేశించాలని కోరారు.

మిట్స్‌కు త్రిపుల్ ఏ రేటింగ్

కురబలకోట: అంగళ్లలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు జాతీయ స్థాయిలో టాప్ 20 కళాశాలగా త్రిపుల్ ఏ రేటింగ్ లభించినట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు. ఎన్‌పీటీఈఎల్ ఆన్‌లైన్ పరీక్షల్లో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు 5,734 మంది సర్టిఫికేషన్ కోర్సుల్లో ప్రతిభ కనపరిచారన్నారు. వీరిలో 90 మందికి గోల్డ్ రేటింగ్, 1,024 మందికి సిల్వర్, 2,765 మందికి ఎలైట్ లభించిందని తెలిపారు.